నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, సోమవారం 23 జూన్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

'కాళేశ్వరం'తో సాగునీళ్లిచ్చిన ఘనత కేసీఆర్‌ది

- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

వనపర్తి టౌన్, జూన్ 22 : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణీత సమయంలో కట్టి సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సోషల్ ఫౌండేషన్ (టీఎ స్ఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ జల వనరులు, వ్యవసాయం, నాడు, నేడు, రేపు అనే అంశంపై హైదరాబాద్‌లోని షోయబ్ హాల్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరై నీళ్ల ప్రాధాన్యత, నేటి పాలకులు సాగునీటి నిల్వలో నిర్లక్ష్యం చేస్తున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గతంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోవడం, సకల జీవరాశుల జీవనం దుర్వేద్యం కావడం గమనించిన నాటి తెలంగాణ పాలకులు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి నీటిని నిల్వ చేసి భావితరాల భవిష్యత్‌కోసం బాటలు వేశారని కొనియాడారు. నేటి పాలకులు ముందుచూపు లేకుండా వ్యవహరించడంతో మనకు దక్కాల్సిన నీటి వాటాలు ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయని దుయ్యబట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రాజెక్టులు కట్టడానికి పాలకులు 23, 30, 40 ఏండ్లు సాగదీశారని కానీ కేసీఆర్ గారు మూడున్నర ఏండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కోటి ఎకరాలకు నీళ్లందించారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణం 90శాతం పూర్తి చేశారని, ప్రస్తుత పాలకులు మిగిలిన 10శాతం పనులు కూడా చేయలేక పోతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే తరాలు మరో గ్రహం మీద ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం వస్తుందని జోస్యం చెప్పారు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించి రైతులకు, ప్రజలకు క్షేమం చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశానికి నర్సింహారెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ, శ్రీధర్‌రావు, దేశ్‌పాండే, వేణుగోపాల్ స్వామి, అయాచితం శ్రీధర్, వెంకటేశం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

- **మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

పాలమూరు, జూన్ 22 : మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రజలందరూ పనిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో ఆదివారం జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా పూలే దంపతులు పనిచేశారని గుర్తుచేశారు. ప్రజలను విద్యావంతులు చేసి వారిలో చైతన్యం కోసం కృషి చేశారన్నారు. అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్న, సురవరం ప్రతాపరెడ్డి, కొమురం భీం, ఐలమ్మ, పండుగ సాయన్న వంటి మహనీయులను కులాల పేరుతో విడదీయకుండా వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూలే పేరుపై గురుకులాలు ఏర్పాటు చేశామని, భారీ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

జర్నలిస్ట్ నర్సింహులు మృతికి సంతాపం..

మహబూబ్‌నగర్ రూరల్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన దాసరి నర్సింహులు జర్నలిస్ట్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం వారి ఇంటికెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, జర్నలిస్టు సంఘం నాయకులు బండి విజయ్‌కుమార్, అశోక్‌కుమార్ వార్డు సభ్యులు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆర్డీఎస్ కాల్వలో పేరుకుపోయిన చెత్తచెదారం

- **ముందుకు పారని నీళ్లు**
- **ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్డీఎస్ రైతులు**

కాల్వ ఇలా.. నీళ్లు పారేదెలా?

వడ్డేపల్లి, జూన్ 22 : ఆర్డీఎస్ కాల్వలో, తూములో కంపచెట్లు, చెత్తాచెదారం చేరి నీళ్లు ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు. కాల్వ నిండా చెత్త, కంపచెట్లు పేరుకు పోవడంతో పొలాలకు నీళ్లు పారడం లేదని తెలిపారు. కాగా, నీళ్లు నిలిచిన చోట్ల కాల్వ పక్కన పొలాల్లోకి నీళ్లు అధికంగా వస్తూ పంటలు దెబ్బతింటున్నాయని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ముండ్లకంప పేరుకుపోవడంతో నిలిచిన నీళ్లు

జూరాలకు స్థిరంగా వరద

గద్వాల/అయిజ, జూన్ 22 : జూరాల ప్రాజెక్టుకు స్థిరంగా వరద కొనసాగుతున్నది. ఆదివారం మూడు గేట్లు ఎత్తి దిగువకు 12,303 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.869 టీఎం సీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ నుంచి 53వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, విద్యుదుత్పత్తికి 38,164, భీమా లిఫ్ట్-1కు 650, భీమా-2కు 750, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ప్రధాన ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 500, ఆర్డీఎస్ లింక్ కాల్వకు 150, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు మొత్తం అవుట్ ఫ్లో 53,771 గా నమోదైంది.

తుంగభద్ర డ్యాంకు నిలకడగా..

కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర డ్యాంకు వరద నిలకడగా కొనసాగుతున్నది. ఆదివారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 25,450 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 192 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 44.460 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ ద్వారా దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు 185 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 355 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7అడుగుల నీటి మట్టం ఉన్నది.

మానవపాడులో లింగమయ్యపై మట్టి, పేడ పూసి పూజలు చేస్తున్న చిన్నారులు

లింగమయ్యా.. కరుణించవయ్యా..

మానవపాడు, జూన్ 22 : వానకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా వర్షాలు కురువకపోవడంతో రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నాడు. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక చిన్నారి ముందుకొచ్చి లింగమయ్యను పశువుల పేడ, మట్టితో నిండుగా కప్పేసి పూజలు నిర్వహించారు. అయితే లింగమయ్య నిండుగా ఉన్న మట్టి, పేడ కరగడానికి వర్షం కురుస్తుందని ప్రజల నమ్మకం. గతంలో కూడా వర్షం కోసం ఇలా పూజలు చేయగా, సకాలంలో కురిశాయని గ్రామస్తులు అంటున్నారు.

అసంపూర్తి పనులతో ట్రాఫిక్ అంతరాయం

అర్థాంతరంగా..

వనపర్తిలో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ

- **ఏడాదిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు**
- **బీఆర్ఎస్ హయాంలో జెట్ స్పీడ్‌లో రోడ్ల విస్తరణ**
- **కాంగ్రెస్ సర్కారు రాగానే పనులు కనుమరుగు**
- **కలెక్టర్ సమీక్షించి చెప్పినా స్పందన కరువు**
- **మున్సిపల్ అధికారుల చర్యలపై అయోమయం**

వనపర్తి,జూన్ 18(నమస్తే తెలంగాణ) : ఎన్నో ఏండ్లుగా ట్రాఫిక్ అంతరాయంతో విసిగివేసారిన ప్రజలకు బీఆర్ఎస్ హయాంలో వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణతో మోక్షం లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాక మధ్యలో అసెంబ్లీ ఎన్నికలతో బ్రేక్ పడింది. ఇక అంతే.. చేపట్టిన రోడ్ల విస్తరణ అర్థాంతరంగా నిలిచిపోయింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం విస్తరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎన్నికలకు ముందు ఉరుకులు, పరుగులపై కొనసాగిన రోడ్ల విస్తరణ అనంతరం విరామం అన్నట్లుగానే కనిపిస్తున్నది. అసంపూర్తి పనులు, అసౌకర్యాల రోడ్లతో జిల్లా కేంద్రంలో రాకపోకలు అస్తవ్యస్తంగా మారాయి. జిల్లా కేంద్ర వాసులు ఏళ్లుగా ఎదురు చూసిన రోడ్ల విస్తరణ ఆశలపై మేఘాలు కమ్ముకున్నట్లుగా నిలిచిన పనులు దర్పణం పడుతున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలని పనులు..

అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత ప్రభుత్వంలోనే మెజార్టీ విస్తరణ పనులు జరిగాయి. ఇక కొద్దిమేర మాత్రమే విస్తరణ మిగిలింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పనుల ఊసేలేదు. ప్రసంగాలు తప్పా పనులు ఎక్కడా లేవన్న విమర్శలు ప్రజల నుంచి వెల్లెవెత్తుతున్నాయి. కొత్త పనుల సంగతి అటుంచితే.. అర్థాంతరంగా ఆగిన పనులను సహితం రెండేళ్ల పుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే, గతంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పర్యవేక్షణలో అత్యంత వేగంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడాన్ని సాహసోపేత నిర్ణయమని ఇప్పటికీ ప్రజలు చర్చించుకుంటున్నారు.

కలెక్టర్ సమీక్షలకు స్పందన కరువు..

కలెక్టర్ ఆదర్శ్ సురభి పలు దఫాలుగా పట్టణ రోడ్ల విస్తరణపై సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు దాదాపు 5సమీక్షలను ఏర్పాటు చేసినా అంగుళం కూడా విస్తరణకు నోచుకోలేదు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే కూడా రోడ్ల విస్తరణను పూర్తి చేయిస్తామంటూ పలు సందర్భాల్లో వెల్లడించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పనులు కనిపిస్తున్నాయి. వరుస సమీక్షలు తప్పా ఒరిగిందేమీ లేదన్నట్లు రోడ్ల విస్తరణ పనులపై పట్టణ ప్రజలు విసుగు చెందుతున్నారు. ఎవరిని కదిలించినా ఏమున్నది రెండేళ్ల పుతున్నాయన్న ప్రశ్నలే ఉదయిస్తున్నాయి. నాలుగు రోడ్ల పనుల్లో మూడు రోడ్ల పనులు ఇంచుమించు పూర్తయ్యాయి. ప్రతి సమీక్షలోనూ మున్సిపల్ అధికారులకు మిగిలిన విస్తరణపై కలెక్టర్ దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు.

విస్తరణకు నోచుకోని పెబ్బేరు రోడ్డు..

పెబ్బేరు రోడ్డులో కిలోమీటరు మేర రోడ్డు పనులు చేపట్టాల్సి ఉన్నది. కాగా, పూర్తిగా పెండింగ్‌లోనే ఉన్నది. కేవలం డ్రైనేజీ కోసం కొంతమేర నిర్మాణాలు తొలగించినా డ్రైనేజీ ఏర్పాటు చేయలేదు. మరికొన్ని చోట్ల ఇండ్ల నిర్మాణాలను యజమానులే తొలగించుకోగా, ఇంకొన్ని అలాగే ఉన్నాయి. ఇక వీటి తోనే విస్తరణ పనులు నిలిచిపోయాయి ఇంకా ఇండ్ల తొలగింపు, విద్యుత్ స్తంభాలను తీసివేయడం, డ్రైనేజీని పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం వల్ల పెబ్బేరు రోడ్డు విస్తరణ పనులన్నీ మొదలు కాలేదన్న అభిప్రాయం ఉన్నది. ఇదిలా ఉంటే, రెండేళ్లుగా విస్తరణపై ఎలాంటి చలనం లేనందూ ఇక మూలకు పడ్డట్లే అన్నట్లు షాపులు, ఇండ్ల యజమానులు మళ్లీ యథావిధిగా నిర్మాణాలను సవరించుకుంటే, మరికొన్ని మధ్యలోనే నిలిచాయి. డ్రైనేజీల కోసం కాల్వలు తవ్వి వదిలేయడం, నిర్మాణాలు చేపట్టకపోవడంతో విధిలేని పరిస్థితిలో సొంతంగా పైపులు వేసుకున్నారు.

రూ.49కోట్ల అంచనాతో పనులు..

జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణను రూ.49.7కోట్ల అంచనాతో చేపట్టారు. నాలుగు రోడ్లకు కలిపి 6కిలో మీటర్ల పొడవు, మరో 3 బ్రిడ్జిల నిర్మాణాలను ఈ బడ్జెట్‌లో రూపొందించారు. రెండేళ్ల కిందట ప్రారంభమైన ఈ పనులను నాలుగు విభాగాలుగా చేపట్టారు. వీటిలో చిట్యాల రోడ్డు, గోపాల్‌పేట, పాన్‌గల్, పెబ్బేరు రోడ్డు ఉన్నాయి. వీటిలో చిట్యాల, గోపాలపేట రోడ్డు పనులు మెజార్టీగా జరిగాయి. గోపాలపేట రోడ్డు వైపు విస్తరణలో మూడు కిలోమీటర్ల రోడ్డంటే, 2.85 కిలో మీటర్ల రోడ్డును పూర్తి చేశారు. మరో రెండు బ్రిడ్జీలు కూడా నిర్మించారు. చిట్యాల రోడ్డు పనుల వారీగా చూస్తే.. ఇందులోనూ 3 కిలో మీటర్ల రోడ్డుకు గానూ దాదాపు ఏర్పాటు చేశారు. డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్ స్థంభాల తొలగింపులాంటివన్నీ ఎన్నికలకు ముందే చేపట్టారు. చింతలహనుమాన్ ఆలయ సమీపంలో బ్రిడ్జీ నిర్మాణం చేపట్టారు. ఇక పాన్‌గల్ రోడ్డు విస్తరణ పనులను చూస్తే.. ఇక్కడ కిలో మీటరు వరకు రోడ్డు వేయాల్సి ఉండగా, కేవలం 400 మీటర్లు మాత్రమే వేశారు. ఇంకా ఇండ్లు తొలగించడం, డ్రైనేజీ నిర్మాణ పనులు, విద్యుత్ స్తంభాల తొలగింపులాంటివన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం 30శాతం పనులు జరిగినట్లు అంచనా ఉన్నది.

అడ్డంకులు తొలగిస్తే..

మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేయాలంటే రోడ్లపై ఉన్న అడ్డంకులను మున్సిపల్ అధికారులు తొలగించాలి. డ్రైనేజీ ఏర్పాటు చేయడం, విద్యుత్ స్తంభాలను తొలగించడం లాంటివి చేస్తే, మా పనులను ప్రారంభిస్తాం. మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ పరిధిలో ఉన్న పనులను చేపడితే మా పని చేయడం సులభం. ఇప్పటికే కలెక్టర్ సమీక్ష నిర్వహించి పనులు చేపట్టాలని ఆదేశించారు.

- విష్ణు, డీఈ, రోడ్లు భవనాల శాఖ, వనపర్తి టౌన్

ఇరుకు రోడ్డులో వాహనదారుల ఇబ్బందులు

- **భార్య, ఆమె బంధువులపై అనుమానం**

ప్రైవేట్ సర్వేయర్ దారుణ హత్య

- **కర్నూల్ జిల్లాలోని పిన్నాపురం చెరువు సమీపంలో మృతదేహం లభ్యం**

గద్వాల అర్బన్, జూన్ 22 : జిల్లా కేంద్రంలోని రాజావీధికి కాలనీకి చెందిన తేజేశ్వర్(32) జిల్లాలో ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమించి మే 18వ తేదీన పెండ్లి చేసుకున్నాడు. పెండ్లికి ముందు సదరు యువతితో ప్రేమలో ఉన్నప్పుడే మనస్పర్థలు రావడంతో కొన్నిరోజులు ఇద్దరు దూరంగా ఉన్నారు. కొన్నిరోజుల తర్వాత మనస్పర్థలు తొలగిపోవడంతో వీరు పెండ్లి చేసుకున్నారు. పెండ్లి తర్వాత యువతి వ్యవహారశైలిలో మార్పు రావడంతో ఇద్దరి మధ్య మళ్లీ మనస్పర్థలు చోటు చేసుకున్నట్లు సమాచారం. యువతితోపాటు ఆమె తల్లికి కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ బ్యాంక్ మేనేజర్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. పెండ్లి అయిన నెల రోజుల్లో మళ్లీ తేజేశ్వర్‌కు కాదని సదరు యువతి బ్యాంక్ మేనేజర్‌తో చనువుగా ఉన్నట్లు తేజేశ్వర్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వీరి వ్యవహారానికి తేజేశ్వర్ అడ్డువస్తున్నాడని గ్రహించిన అతని భార్య, అత్త, బ్యాంక్ మేనేజర్ హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ క్రమంలో తేజేశ్వర్‌ను ఈనెల 17వ తేదీన కొందరు వ్యక్తులు భూమి సర్వే చేయాలని కారులో ఎక్కించుకొని వెళ్లినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సాయంత్రం అయినా తేజేశ్వర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది జిల్లా కేంద్రంలో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో ఎస్సీ శ్రీనివాసరావు ప్రత్యేక బృందంతో ఆరా తీయగా శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా పాణ్యం సమీపంలోని పిన్నాపురం చెరువు సమీపంలో తేజేశ్వర్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు తేజశ్వర్ మృతదేహాన్ని జిల్లా కేంద్రానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే తేజేశ్వర్‌కు భార్య, అత్త, బ్యాంక్ మేనేజర్ పథకం ప్రకారం హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయంపై గద్వాల సీఐ టంగుటూరి శ్రీనును వివరణ కోరగా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నామన్నారు. తేజేశ్వర్ మొబైల్‌తోపాటు భార్య, అత్త అందరి ఫోన్లను ట్రేస్ చేసినట్లు తెలిపారు. త్వరలో ఈ కేసును ఛేదించి వివరాలను వెల్లడిస్తామన్నారు.

ముందస్తు మురిపెం

నిండుకుండలా జూరాల

- **వరద ప్రవాహంతో కృష్ణమ్మకు జలకళ**
- **జూరాలకు వరద**
- **ఎత్తిపోతలతో పాటు కాల్వలకు నీటి విడుదల**

గద్వాల, జూన్ 22 : ముందస్తుగా జూరాల ప్రాజెక్టుకు వరద వచ్చి చేరడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మురిసిపోతున్నది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వరద క్రమంగా పెరుగుతూ వస్తున్నది. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా వారంరోజులుగా వస్తున్న వరదతో ప్రస్తుతం 8.869 టీఎం సీల మేర నీరు నిల్వ ఉన్నది. ముందస్తుగా ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుండడంతో అధికారులు ఎత్తిపోతల పథకాలు ఆన్‌చేసి రిజర్వాయర్లను నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నెట్టెంపాడ్ లిఫ్ట్ ఆన్ చేయగా, భీమా, కోయిల్‌సాగర్, జూరాల కుడి ప్రధాన కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ముందస్తుగా జూరాల ప్రాజుక్టుకు వరదలు రావడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రైతులు సంబురంగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని జూరాల..

ఉమ్మడి పాలమూరు జిల్లాకు జూరాల ప్రాజెక్టు వరప్రదాయినిగా నిలుస్తున్నది. ఇటు కాల్వలు, అటు ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయా జిల్లాలకు వ్యవసాయానికి సాగునీరు అందించడంలో జూరాల ప్రాజెక్టు పెద్దన్న పాత్ర పోషిస్తున్నది. ప్రస్తుతం 9.657 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు కింద సుమారు లక్షా రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. జూరాల కుడి కాల్వ 46కిలో మీటర్ల పొడవుతో ప్రవహిస్తూ 35వేల ఎకరాలకు, ఎడమ కాల్వ వందకిలో మీటర్ల మేర ప్రవహిస్తూ 67వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నది. కుడి కాల్వ జోగులాంబ గద్వాల జిల్లాలో సాగు నీరు అందుతుంటే, ఎడమ కాల్వ ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వనపర్తి, మక్తల్, దేవరకద్ర, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి పథకాలకు నీటిని తీసుకుంటున్నారు. కుడి కాల్వపై జములమ్మ రిజర్వాయర్, ఎడమ కాల్వపై రామన్‌పాడ్, గోపాల్‌దిన్నె రిజర్వాయర్లు ఆధారపడి ఉన్నాయి. వేసవిలో డెడ్ స్టోరేజ్‌కు పడిపోయిన జూరాల ప్రాజెక్టు ఆదివారం నాటికి 8.869 టీఎం సీలకు చేరుకోవడంతో 90శాతం నిండినట్లయ్యింది. జూరాల ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు కురువడంతో జూరాలకు వరద వచ్చి చేరుకుంటుంది. వారం రోజులుగా వరద కొనసాగుతుండడంతో జూరాల నిండుకుండలా మారింది.

ఎత్తిపోతలు షురూ..

వారంరోజులుగా జూరాలకు స్థిరంగా వరద వచ్చి చేరుతుండడంతో నెట్టెంపాడ్ లిఫ్ట్‌ను ప్రారంభించారు. దీంతో పాటు భీమా-1, కోయిల్‌సాగర్, జూరాల కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. జూరాలకు మరో ఒక టీఎం సీల వరద వస్తే పూర్తి స్థాయికి చేరుకుంటుంది. దీంతో ఈ వానకాలం సాగుకు ఎటువంటి నీటి ఢోకా ఉండదు. పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడంతో నెట్టెంపాడ్, కోయిల్‌సాగర్, భీమాల ఎత్తిపోతల ద్వారా మూడు లక్షల ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉన్నది. జూరాలకు జలకళ రావడంతో ముందస్తుగా వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయని వానకాలం సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. జూరాల ముందస్తుగా మురిపెంతో అన్నదాతలు ఆనందంతో సాగుకు సై అంటున్నారు.

ఉడుమును మింగిన కొండ చిలువ

గోపాలపేట, జూన్ 22 : ఉడుమును మింగిన కొండ చిలువను బంధించి ఉడుమును కక్కించిన ఘటన గోపాలపేట మండల కేంద్రం శివారులో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం గోపాల్‌పేట అస్లం కుంట (చెరువు) వద్ద ఆదివారం ఉదయం కొండ చిలువ ఉడుమును మిగుతుండగా గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి కిరణ్ చూసి సాగర్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఆయన వెంటనే తన బృందంతో అక్కడికి చేరుకున్నారు. కొండ చిలువ ఉడుమును మింగి మెల్లగా కుంట నీటిలోకి జారుకుంటుండగా దానిని బంధించి ఒడ్డుకు చేర్చారు. కొండ చిలువ మింగిన ఉడుమును కక్కించారు. ఈ సందర్భంగా కృష్ణసాగర్ మాట్లాడుతూ కొండ చిలువతోపాటు ఉడుము కూడా సురక్షితంగా ఉన్నదని, వాటిని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి వేసినట్లు తెలిపారు. కొండ చిలువ 13 అడుగులు పొడవు, 30 కేజీలు బరువు, ఉడుము 5 ఫీట్ల పొడుగు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్‌సాగర్, అవినాశ్, గ్రామస్తులు ఉన్నారు.

గోపాల్‌పేట శివారులో పట్టుకున్న కొండ చిలువ, కొండ చిలువ మింగిన ఉడుమును చూపిస్తున్న సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు